క్లుప్తంగా

మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీలోని శ్రీకోదండ రామాలయంలో ధ్వజస్తంభ, శ్రీమల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠల కోసం మంగళవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమి పూజ చేసి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు వైస్ ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, సమితిసింగారం సర్పంచ్ బచ్చల భారతి, ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్నప్ప, గౌరవ అధ్యక్షుడె మంగి వీరయ్య, సానికొమ్ము దేవిరెడ్డి, ముమ్మడి కాంతాచారి, కోశాధికారి నాగళ్ల సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి వనచర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గోదారంగనాయకుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్‌ని భద్రాద్రి శ్రీకృష్ణ దేవాలయంలో మంగళవారం గోదారంగ నాయకుల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు ఆనందోత్సాహాలతో స్వామి కల్యాణాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

మణుగూరురూరల్: కరకగూడెం మండలం రఘునాథపాలెం గ్రామానికి చెందిన సమ్మయ్య ఇళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి గురై సర్వ కాలిపోగా.. మణుగూరు ఏరియాలోని ఓసీ2 డంపర్ మెయింటెనెన్స్ కార్మికులు ఆర్థిక సాయం అందించారు. విరాళాలుగా సేకరించిన రూ.15వేల నగదు, 25కేజీల బియ్యాన్ని గని డీజీఎం రాజారావు, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ చేతుల మీదుగా మంగళవారం బాధితునికి అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉపాధ్యక్షులు రాంనర్సయ్య, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ నాయకులు ఎన్.జీవరత్నం, వెంకటరత్నం, సెక్షన్ అధికారి పి.నారాయణ, బి.శ్రీనివాస్, అబ్దుల్ రవూఫ్, ఎం సుధాకర్, తాజుద్దీన్, నరేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో బోరు ఏర్పాటు



శ్మశాన వాటికలో బోరు వేయిస్తున్న మోరంపల్లిబంజర గ్రామస్తులు

బూర్గంపాడు: గ్రామస్తుల సహకారంతో మోరంపల్లిబంజర శ్మశాన వాటికలో మంగళవారం బోరు ఏర్పాటు చేశారు. అంత్యక్రియలు, కర్మకండల సమయంలో నీళ్లకు ఇబ్బందులు పడుతుండటంతో గ్రామస్తులు ఆర్థిక సహకారంతో బోరును ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక సర్పంచ్ భూక్యా దివ్యశ్రీ, ఉపసర్పంచ్ కైపు లక్ష్మీనారాయణరెడ్డిలు కొబ్బరికాయలు కొట్టి బోరు వేయడం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ



గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని సున్నంబట్టీ సమీపంలోని మత్స్యకారకాలనీలో మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో గోపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్య పిలకా నాగేంద్రరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని పురాతన శ్రీ ఆది శేషావతార వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కనుమ పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవగా తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ధూప దీపనైవేద్య ఉపాధ్యక్షుడు ఆరుట్ల రాజగోపాలాచార్యులు, టీటీడీ నుంచి శిక్షణ పొందిన అర్చకులు జీలకర్ర వీరయ్య జీసీ సభ్యులు దుడ్ల రాఘవశర్మ, అర్జున్, పిలకా వెంకటరమణారెడ్డి, తాళ్లూరి వీర్రాజు, పాపమ్మ, నర్సయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడల్లో సంక్రాంతి సంబురాలు



దమ్మపేట: సంక్రాంతి ముగ్గు వేస్తున్న మహిళలు



కరకగూడెం: రాయనిపేటలో ముగ్గులు వేస్తున్న మహిళలు

అశ్వారావుపేటరూరల్: అన్ని గ్రామాల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ వేడుకలను జరుపుకున్నారు. మహిళలు, యువతులు ఉదయాన్నే ఇళ్ల ముందు, ఆవరణలో రంగురంగులతో రంగువల్లులను వేసి వాటి మధ్యలో గొబ్బెమ్మలు, నవధ్యాన్యాలు ఉంచారు. నూతన దుస్తులు ధరించి గోపూజలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు, యవతి, యువకులు పతంగులను ఎగుర వేసి సందడి చేయగా, పెద్దలంతా పొరుగున జరిగిన కోడి పందేలకు వెళ్లారు.

దమ్మపేట: మండల పరిధిలోని ప్రతీ గ్రామంలో సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే మహిళలు ఇంటి ముందర ప్రాంగణంలో, సంక్రాంతి ముగ్గులను, రకరకాల రంగులతో చూడచక్కని రీతిలో, వర్ణశోభితంగా తీర్చిదిద్దారు. ముగ్గుల్లో పేడతో తయారుచేసిన గొబ్బెమ్మలను ఉంచి, వాటిలో రేగు పండ్లు, పూల రేకులను పోశారు. కుటుంబ సమేతంగా ఉదయాన్నే స్నానాది కార్యక్రమాలను అచరించి, నూతన వస్త్రాలు ధరించారు. సమీపంలోని దేవాలయాలకు వెళ్లి, తమ ఇష్ట దైవాలను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో కలసి రకరకాల పిండి వంటలతో కూడిన విందు భోజనాన్ని ఆరగించారు.

కరకగూడెం: మండల వ్యాప్తంగా సంక్రాంతి పండుగను సోమవారం మండల వాసులు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తమ ఇళ్ల ఎదుట రంగు రంగుల ముగ్గులు వేశారు. తాటిగూడెం, రాయనిపేట, కొత్తూర్ గ్రామాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. మంగళవారం కనుమ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.

గుండాల: ఆళ్లపల్లి మండలంలోని సీతానగర్ గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకుని కొమురం భీం యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు మాట్లాడారు. పోటీల్లో గెలుపొందిన సాగబోయిన వినీత, గొగ్గెల సుమతి, మొగిలపల్లి ఉపెంద్రలకు బహుమతులు అందించారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో కూడా ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాయం రమేష్, వినోద్, మద్దెల శ్రీను, సురేష్, రంజీత్, రవి, నవీన్, దేవి తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల కాలనీ గ్రామంలో సంక్రాంతి సందర్భంగా సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ పినపాక నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితియ, తృతియ, పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సలేషన్ బహుమతులను మాజీ జెడ్పీటీసీ, బీఆర్‌ఎస్ పార్టీ మహిళ అధ్యక్షురాలు తోకల లత, ఎంపీటీసీ, ప్రముఖ న్యాయవాది పోరెడ్డి విజయలక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి వల్లెపోగు రాము, నాయకులు రావులపల్లి వెంకటేశ్వర్లు, మచ్చా పృథ్వీరాజు, సామంత్, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.



గుండాల: ఆళ్లపల్లి మండలం సీతానగర్‌లో ఓ ఇంటి ఎదుట ముగ్గు



గుండాల: బహుమతులు అందుకుంటున్న ముగ్గుల పోటీల విజేతలు



అశ్వారావుపేటరూరల్: ఇంటి ఎదుట సంక్రాంతి ముగ్గు వేస్తున్న యువతి



కరకగూడెం: గొల్లగూడెంలో ముగ్గు వద్ద చిన్నారులు



గుండాల: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలి

అశ్వాపురం: క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని చింతిర్యాల గ్రామ పంచాయతీలోని కట్టంవారిగూడెం గ్రామంలో స్థానికుల యువకుల ఆధ్వర్యంలో జరుగుతున్న అల్లూరి సీతారామరాజు మెమోరియల్ మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారం ముగిశాయి. టోర్నమెంట్‌లో కట్టంవారిగూడెం జట్టు విజేతగా నిలవగా, అశ్వాపురం ఎంఆర్‌పీఎస్ యూత్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేత, రన్నరప్‌గా నిలిచిన జట్లకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నగదు బహుమతి, ట్రోఫీని అందజేశారు. టోర్నమెంట్‌లో రాణించిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది సిరిస్, వివిధ కేటగిరిల్లో ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకులు పొడియం బాలరాజు, ఎంపీటీసీలు ఏనిక రవి, కమటం నరేష్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దీన్, సర్పంచ్ పాయం భద్రయ్య, కాంగ్రెస్ నాయకులు ముత్తినేని వాసు, గాదె కేశవరెడ్డి, వేములపల్లి రమేష్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సన్మానం

మణుగూరురూరల్: ఇటీవల జరిగిన నేషనల్ మీట్ ఆర్చరీ క్రీడలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించిన కరకగూడెం మండలం మొగులితోగు గ్రామానికి చెందిన క్రీడాకారుడు చుంచు వంశీని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం స్థానిక ప్రజాభవన్‌లో శాలువాతో సన్మానించి అభినందించారు. వంశీకి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కరకగూడెం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్ర సురేష్, గొగ్గలి రవి, పూనెం బిక్షపతి, తోలెం అర్జున్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

మండల పరిధిలోని విప్పలసింగారం గ్రామంలో వజ్జా నాగేశ్వరరావు జ్ఞాపకార్థం సోమవారం మహిళలకు, యువతులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ పాల్వంచ ఈశ్వరమ్మ, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, గ్రామ యువజన నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



మణుగూరురూరల్: క్రీడాకారుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

క్యాలెండర్లు ఆవిష్కరణ

పట్టణంలోని ప్రజాభవన్ (క్యాంప్ కార్యాలయం)లో సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల వెల్ఫేర్ అసోసియేషన్-2024 నూతన సంవత్సర క్యాలెండర్లను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామం ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండ్‌ను మణుగూరులో ప్రజా భవన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తన గెలుపునకు కృషి చేసిన సీపీఐ, ఏఐటీయూసీ నాయకులకు ఎమ్మెల్యే పాయం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కమటం వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, యూనియన్ గౌరవ అధ్యక్షుడు చుంచు వీరాలు, అధ్యక్షుడు సర్వ కృష్ణ, నాయకులు పసుల ప్రభాకర్, దారపు దేవేంద్రం, చల్లా రాములు, ఉపేంద్రాచారి, సర్వ కల్యాణ్, లక్ష్మణ్, దారపు శ్రీను, పురమ సతీష్, నాయకులు పాల్గొన్నారు.

11 గంటల్లోపు వ్యాపారాలు బంద్

భద్రాచలంఅర్బన్: పట్టణంలో హోటల్, రెస్టారెంట్ యజమానులు రాత్రి 10:30కు, అదే విధంగా పట్టణంలో నిర్వహిస్తున్న ఇతర దుకాణాలు రాత్రి 11:00 కల్లా మూసివేయాలని భద్రాచలం టౌన్ సీఐ నాగరాజు రెడ్డి సూచించారు. మద్యం దుకాణాలు రాత్రి 10 గంటలకు మూసివేయాల్సిందేనని ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బహిరంగంగా నిర్వహించే ఏ కార్యక్రమానికైనా లౌడ్ స్పీకర్లు, మైక్‌లు వినియోగించేందుకు ముందస్తుగా స్థానిక ఏఎస్పీ కార్యాలయం వద్ద అనుమతి తీసుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించటం చట్టరీత్యా నేరమని, పట్టణంలో ఉన్న ప్రతి ఒక్క లాడ్జి, దుకాణాల వద్ద ప్రార్కింగ్ స్థలం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. లాడ్జికి వచ్చే ప్రతి ఒక్కరి వద్ద ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డు జిరాక్స్‌ను తమ రిజిస్టర్‌లో పొందుపరచాలని, లాడ్జీలు, దుకాణాలు నిర్వహణదారులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను వాడకంలో ఉంచాలని ఆయన సూచించారు. పట్టణంలో ఎవరైనా అనుమానస్పదంగా తిరుగుతున్నట్లుగా కనిపించినా, లేదా ఏమైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అనుమానం వచ్చినా వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, అర్ధరాత్రి అసవసరంగా రోడ్లపై హంగామా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నాగరాజు రెడ్డి హెచ్చరించారు.

నిరుపేదలకు అండగా ఉంటాం

కరకగూడెం: సమాజంలోని నిరుపేదలకు అండగా ఉండడమే తమ లక్ష్మమని గ్రేస్ సర్వీస్ సొసైటీ ట్రస్ట్, ఖమ్మం సభ్యుడు, పాస్టర్ పండు సుందర్రావు పేర్కొన్నారు. మంగళవారం కొత్తగూడెం గ్రామంలో ట్రస్ట్ తరుపున 200 మంది నిరుపేద విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లు, బొమ్మలు, సబ్బులు, పేస్టు, పౌడర్లు, స్నాక్స్, గిఫ్ట్ పాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రేస్ సర్వీస్ సొసైటీ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

జనరల్ సెక్రటరీగా సామేలు

దమ్మపేట: జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా దమ్మపేట మండలం, సరోజనాపురం గ్రామానికి చెందిన మద్దిశెట్టి సామేలును, జిల్లా డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య నియమించారు. ఈమేరకు సామేలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియామకపత్రాన్ని పొదెం తనకు అందజేసినట్లు సామేలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని కొండరెడ్డి గ్రామం నడిమి రెడ్డిగూడెంలో నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు నారం నాగలక్ష్మి, సీడీపీఓ రోజారాణి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకంలో భాగంగా కొండరెడ్డి గ్రామానికి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాన్ని మంజూరు చేసిందన్నారు.

ఈ కేంద్రంలో కొండరెడ్డి లబ్ధిదారులకు ప్రత్యేక పోషకాహారాన్ని అందిస్తామని, ఈ సేవలను అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వరాజ్యం, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు చిప్పల కొమ్మిరెడ్డి పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీటీసీ, సీడీపీఓ

విద్యా వలంటీర్ల వినతి

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణలను విద్యా వలంటీర్లు మంగళవారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాన్ని అందించారు. గడిచిన మూడేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వలంటీర్లను ప్రభుత్వం నియమించకపోవడంతో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న తమకు జీవన ఆధారం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయించి, తిరిగి విధుల్లోకి తీసుకునేలా చర్యలు చేపట్టాలని వారంతా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విద్యా వలంటీర్లు కె.భవాన, వి.అశోక్, కె.చిరంజీవి, పి.శ్రీనివాసు, పి.అనీల్, ఎం.సీతారాములు, కె.వినోద్ కుమార్, ఎం.రమేష్, కె.రాజేశ్, ఏ.రాజు ఉన్నారు.



ఎమ్మెల్యే జారేను కలిసి వినతి చేస్తున్న విద్యా వలంటీర్లు

సెమీస్‌కు చేరిన 'యూసఫ్' టోర్నీ



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందిస్తున్న నిర్వాహక కమిటీ ప్రతినిధులు

బూర్గంపాడు: బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న 16వ యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సెమీ ఫైనల్‌కు చేరింది. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్ తొలిమ్యాచ్‌లో రామవరం విరాట్ ఎలెవన్ జట్టుపై బూర్గంపాడు స్మైక్ ఎలెవన్ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో సారపాక తేజ ఎలెవన్ జట్టుపై పాల్వంచ ఫరీద్ ఎలెవన్ జట్టు విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో నగరం ఎఫ్‌సీసీ జట్టుపై పాల్వంచ ఛేజింగ్ ఎలెవన్ జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్ చివరి బాల్ వరకు ఉత్కంఠంగా సాగింది. పాల్వంచ ఛేజింగ్ ఎలెవన్ జట్టు విజయం సాధించేందుకు చివరి బంతికి నాలుగు పరుగులు చేయాల్సి ఉండగా బ్యాట్స్‌మెన్ ప్రవీణ్ సిక్స్ కొట్టి జట్టును గెలిపించాడు. సాయంత్రం జరిగిన నాల్గవ మ్యాచ్‌లో అశ్వాపురం రంజిత్ ఎలెవన్‌పై గుంటుపల్లి ఎలెవన్ జట్టు విజయం సాధించింది. బుధవారం మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ఫరీద్ ఎలెవన్ జట్టు బూర్గంపాడు స్మైక్ ఎలెవన్ జట్టుతో తలపడనుంది. రెండవ సెమీ ఫైనల్ మ్యాచ్‌లో పాల్వంచ ఛేజింగ్ ఎలెవన్ జట్టు భద్రాచలం గుంటుపల్లి ఎలెవన్ జట్ల మధ్య జరగనున్నాయి.ఈ రోజు జరిగిన నాలుగు మ్యాచ్‌లలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు మ్యాచ్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులను అందజేశారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని అచ్యుతాపురంలో మూడు రోజుల పాటు నిర్వహించిన చర్ల, దుమ్ముగూడెం మండలాల స్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. సోయం నవీన్‌కుమార్ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ వాలీబాల్ పోటీలలో ప్రథమ స్థానంలో చర్ల మండలానికి చెందిన చీమలపాడు జట్టు నిలవగా, రెండో స్థానంలో దుమ్ముగూడెం మండలానికి చెందిన అచ్యుతాపురం జట్లు తృతీయ స్థానంలో పైడిగూడెం జట్లు నిలచాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏటీఏ రాష్ట్ర అధ్యక్షుడు జయబాబు, సీనియర్ నాయకులు కారం గాంధీ, అపగా శంకర్, కొర్సా చిట్టిబాబు, సోయం కృష్ణ, మిచ్చా వెంకటేశ్వర్లు, సోయం కోటేశ్వరావు, కుంజా బక్కయ్య, సర్పంచ్ కృష్ణవేణి, ఉప సర్పంచ్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు..

బూర్గంపాడు: సంక్రాంతి పండుగ సందర్భంగా ఐద్వా, వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో సారపాక సుందరయ్యనగర్‌లో మహిళలకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. మహిళలు మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండేందుకు క్రీడా పోటీల్లో పాల్గొనాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. రెండు రోజుల పాటు జరిగిన కబడ్డీ పోటీల విజేతలకు మంగళవారం బహుమతులను అందజేశారు. పోటీలలో పాల్గొన్న వారందరికి కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాతా మాధవీలత, పాపినేని సరోజని, ఎస్‌కె.అబీదా, కనకం వెంకటేశ్వర్లు, ఎస్కె జానిమియా, ఎండీ హుస్సేన్, రాధ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: కొమ్ము నృత్యంలో ప్రతిభ చూపిన వారికి బహుమతి..

కోయరంగాపురంలో పోటీలు..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని కోయ రంగాపురం గ్రామంలో యువత ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కబడ్డీ, వాలిబాల్, ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్, కొమ్ము నృత్యాలు, విలువిద్య పోటీలను మూడు రోజుల పాటు జరిగాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంగళవారం బహుమతులు, జ్ఞాపికలను అందించారు.

గుంతలతో భయం.. భయం

- అధిక లోడ్ వాహనాలు, వరదలతో రోడ్డు ధ్వంసం
- గాయాలపాలవుతున్న వాహనదారులు
- పట్టింపులేని అధికారులు

మణుగూరురూరల్: దినదినాభివృద్ధి చెందుతున్న మణుగూరులో మణుగూరు-ఏటూరునాగారం ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఈ రహదారి గుండా ప్రయాణించాలంటేనే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీఎస్పీ కాటా నుంచి బీటీపీఎస్ వరకు ఉన్న రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఈ గుంతల్లో పడి ఎంతోమంది వాహనచోదకులు అదుపుతప్పి కింద పడిన సంఘటనలు, వాహనాలు నిలిచి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడిన ఘటనలు లేకపోలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు గుంతలు మరింత పెద్దవై వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారాయి. ఈ గుంతల్లో పడి పలువురు గాయాలపాలవుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గం గుండానే ప్రయాణిస్తుంటాయి. వీటికి తోడు బీటీపీఎస్‌కు బొగ్గు రవాణా చేసే లారీలు, టిప్పర్లు, బీటీపీఎస్‌కు యంత్రాలు తెచ్చే భారీ వాహనాలు ఈ రహదారి మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో భారీ వాహనాల సామర్థ్యానికి సైతం రహదారి గుంతలు ఏర్పడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెలలో వారం రోజుల పాటు వర్షాలు కురియగా.. ఓ బొగ్గు లారీ ఇసుక బంకర్ ప్రాంతంలోని గుంతలో పడి ఇరుక్కుపోవడంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ రోడ్డు విషయంలో గతంలో కూడా ఎన్నో పత్రికా కథనాలు వచ్చినా కూడా సంబంధిత అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వతంగా పరిష్కరించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడినా, తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించకపోవడంతో వారి నిర్లక్ష్య వైఖరి పట్ల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌అండ్‌బి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి రహదారికి శాశ్వత మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రహదారిపై ఏర్పడిన పెద్ద గుంత

గుంతల రోడ్డుతో ఇబ్బందులు

బీటీపీఎస్ రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మార్గం గుండా రాకపోకలు సాగించాలంటేనే భయాందోళన చెందుతున్నాం. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతోంది. జిల్లా కలెక్టర్ స్పందించి రహదారి సమస్యను పరిష్కరించాలి.

– ఎం.సీతారాములు, రామానుజవరం

ప్రాణభయంతో ప్రయాణం

మణుగూరులోని సీఎస్పీ కాటా నుంచి బీటీపీఎస్ వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయం భయంగా ప్రయాణిస్తున్నాం. రాత్రివేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంది. జిల్లా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలి. రోడ్డు సమస్యను పూర్తిగా తొలగించాలి.

– రామకృష్ణ, మణుగూరు

శాశ్వత పరిష్కారం చూపాలి

మణుగూరు సీఎస్పీ ప్రాంతం నుంచి బీటీపీఎస్ వరకు రోడ్డు తరచూ అధ్వానభరితంగా మారుతోంది. గుంతలమయ రహదారితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిని పునర్నిర్మించాలి. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

– ఎస్.సాంబశివరావు, విజయనగరం